# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-09-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఉన్నత స్థాయి కమిటీ చేసిన జమిలి ఎన్నికల సిఫారసులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**
2. **రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజా ప్రతినిధులు మార్గదర్శక పత్రాలను రూపొందించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అనేక హామీలు నెరవేర్చామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే పవన్ కళ్యాణ్ తెలిపారు.**
4. **తెలంగాణలో ప్రతి విద్యార్థికీ ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల నిర్మాణపనులను వేగంగా పూర్తిచేయాలని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి విజ్ఞప్తి చేశారు.**

==========================

దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఉన్నత స్థాయి కమిటీ చేసిన జమిలి ఎన్నికల సిఫారసులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నిన్న ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. జమిలి ఎన్నికలకు సంబంధించి పూర్వ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రూపొందించిన నివేదికను మంత్రివర్గం ఆమోదించిందని తెలిపారు. అత్యున్నత స్థాయి కమిటీ ఇచ్చిన సిఫారసులను రెండు దశలలో అమలు చేస్తామని ఆయన చెప్పారు.సార్వత్రిక ఎన్నికలు జరిగిన వంద రోజుల్లో పంచాయతీలు, మున్సిపాలిటీల వంటి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 23 సెకన్లు)

అదేవిధంగా చంద్రయాన్- 4కు, గగన్‌యాన్, చంద్రయాన్ ప్రాజెక్టుల విస్తరణ, గిరిజన గ్రామాల అభివృద్ధికి 79,156 కోట్ల రూపాయల కేటాయింపుకు, నూనెగింజల సాగును పెంచేందుకు పీఎం-ఆశా పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌కు ఫాస్పేట్, పొటాషియం ఎరువులపై రాయితీ, బయోటెక్నాలజీ రంగంలో పరిశోధన-అభివృద్ధి పనులకు ఉద్దేశించిన బయో-రైడ్ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు.

---------------------------

జమిలి ఎన్నికలపై పూర్వ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రూపొందించిన నివేదికకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన క్రమంలో దీనిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం వేదికగా స్పందించారు. దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత శక్తిమంతంగా, భాగస్వామ్యయుతంగా మార్చే కీలక ముందడుగుగా పేర్కొన్నారు. ఉన్నతస్థాయి కమిటీకి నాయకత్వం వహించినందుకు, నివేదిక రూపకల్పనలో భాగంగా అన్ని వర్గాలతో విస్తృత చర్చలు జరిపినందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు అభినందనలు తెలిపారు.

---------------------------

రాష్ట్రాభివృద్ధి కోసం పార్లమెంట్ సభ్యులు శాసనసభ్యులు, నియోజకవర్గాల వారీగా మార్గదర్శక పత్రాలను రూపొందించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిన్న నిర్వహించిన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వచ్చే ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. రాజధాని అమరావతికి నిధులను సమీకరిస్తున్నామని, పోలవరాన్ని పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (34 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అనేక హామీలు నెరవేర్చామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే పవన్ కళ్యాణ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిన్న నిర్వహించిన ఎన్ డి ఏ శాసనసభపక్ష సమావేశంలో పవన్ కళ్యాణ్ పాల్గొని మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పింఛన్లను పెంచి ఇచ్చామని, పంచాయతీల బలోపేతానికి 14 వందల 52 కోట్ల రూపాయలను కేటాయించామని చెప్పారు. అన్న క్యాంటీన్ల వల్ల పేదలు, కార్మికులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని తెలిపారు. భూ హక్కు చట్టాన్ని రద్దు చేసి పేదల భూములకు రక్షణ కల్పించామని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో ప్రతి విద్యార్థికీ ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. నిన్న హైదరాబాద్‌లో సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించిన– ఎంఎస్ఎంఈ నూతన విధానాన్ని ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, యువతకు వ్యవసాయం, పరిశ్రమల్లో పెట్టుబడి పెట్టేందుకు తగిన చేయూతనిస్తామని వెల్లడించారు. వ్యవసాయ రంగంలో యువత ఎదిగేవిధంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలోని విద్యార్థుల్లో వృత్తి విద్యా నాయకులను పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

---------------------------

నూతన మద్యం విధానానికి ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని సచివాలయంలో నిన్న జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. మంత్రివర్గ నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి

కొలుసు పార్ధసారధి పాత్రికేయులకు వివరించారు. విజయనగరంలో నిర్మిస్తున్న భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరును పెట్టనున్నామని తెలిపారు. వాలంటీర్ల వ్యవస్థ పునరుద్ధరణపై మరింత సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు. ప్రజారోగ్యం కోసం 'స్టెమీ' పథకం ప్రారంభించినున్నామని చెప్పారు. ఆధార్ తరహాలో విద్యార్థులకు 'అపార్' గుర్తింపు కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వాలంటీర్లను, సచివాలయాలను వివిధ శాఖాల్లో కలిపేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నిధులు మంజూరై వివిధ కారణాలతో ఆగిన జాతీయ రహదారుల నిర్మాణపనులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కేంద్ర రహదారులు, రవాణశాఖ మంత్రి నితిన్‌గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. నిన్న ఢిల్లీలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడితో కలిసి కేంద్రమంత్రికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర రహదారి మౌలికవసతుల నిధి కింద రాష్ట్ర ప్రభుత్వం పంపిన 350 కోట్ల ప్రతిపాదనలను ఆమోదించాలని కోరినట్లు వెల్లడించారు. వీటిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

---------------------------

తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో 2,050 స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి వైద్య, ఆరోగ్య సేవల రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్‌బీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైనవారు ఈ నెల 28 నుంచి అక్టోబరు 14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ పరిధిలో 15 వందల 76 స్టాఫ్‌నర్సు పోస్టులు, తెలంగాణ వైద్య విధానపరిషత్ పరిధిలో 332, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో 80, ఆయుష్‌లో 61, ఐపీఎంలో ఒక స్టాఫ్‌నర్సుతో కలిపి మొత్తం 2050 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొంది. నవంబరు 17న కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఉంటుందని, హైదరాబాద్ సహా 13 కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల సంభవించిన భారీ వర్షాలు, వరదలు కారణంగా గోదావరి పరివాహక ప్రాంతాల్లో పంట, ఆస్తి నష్టాలను అంచనా వేయాలని రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి రామ్ ప్రకాష్ సిసోడియా అధికారులను ఆదేశించారు. నిన్న అమరావతిలోని సచివాలయం నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లతో దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 538 హెక్టార్లలో వరి పంట దెబ్బతిందని తెలిపారు. జిల్లాలోని పంట, ఆస్తి నష్టాల వివరాలను సేకరిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

---------------------------

ప్రజలకు స్నేహపూర్వక వాతావరణంలో మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్– డిజిపి ద్వారకా తిరుమల రావు తెలిపారు. ఏలూరులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పోలీసుశాఖలో మౌలిక వసతులు పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలీసుల సంక్షేమం కోసం పోలీస్ క్యాంటీన్ల వర్కింగ్ క్యాపిటల్ కింద 4.7 కోట్లు కేటాయించామని అన్నారు.

=====================